క్లుప్తంగా

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లు మొదలవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన పత్రిక ప్రకటనలో వెల్లడించారు. కళాశాలలో బీకాం కంప్యూటర్స్, బీఏ హిస్టరీ మేజర్, బీఎస్సీ జువాలజీ గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ వివరాల కోసం ఆలూరు ప్రభుత్వ కళాశాలను సంప్రదించాలని తెలిపారు.

గర్భిణులకు భోజన సదుపాయం



గర్భిణీలకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్ : స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ క్లస్టర్ కేంద్రానికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు సోమవారం సేవాదళ్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి భోజన సదుపాయాన్ని కల్పించారు. ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ కల్పన భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ లైట్‌నాగరాజు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

వంకలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్ ఇంజిన్

తుగ్గలి : మండల పరిధిలోని గిరిగెట్ల లింగాల వంకలోకి సోమవారం ట్రాక్టర్ ఇంజిన్ దూసుకెళ్లింది. తుగ్గలికి చెందిన ట్రాక్టర్ అమినాబాద్ వైపు వెళుతుండగా మార్గమధ్యలో గిరిగెట్ల వద్ద అదుపు తప్పి వంకలో పడి పోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. జేసీబీ సాయంతో ట్రాక్టర్ ఇంజిన్‌ను బయటకు తీశారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు ఘన వీడ్కోలు

పత్తికొండ రూరల్ : పత్తికొండ వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పరాజయం పొందడంతో ప్రభాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. సీఈఓ ఏసుప్రవక్త ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సభలో శాలువాలు, పూలమాలలతో చైర్మన్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పత్తికొండ ప్రాంత రైతులకు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సంఘాన్ని అభివృద్ధి చేసేందుకు సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

13న పాఠశాలలు పునః ప్రారంభం

మద్దికెర : వేసవి సెలవుల అనంతరం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈనెల 13న పునః ప్రారంభమవుతాయని ఎంఈఓ రంగస్వామి సోమవారం తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు సంబంధించి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. పాఠశాలలు తెరిచిన తరువాత తరగుతుల వారీగా విద్యార్థులకు వీటిని అందించడం జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న పాలకవర్గం, సిబ్బంది

పత్తికొండ రూరల్ : ప్రజాసమస్యల పరిష్కారానికి సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సర్పంచు కొమ్ము దీపిక సూచించారు. సోమవారం పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈఓ నరసింహులు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అప్రూవల్ లేకుండానే కొందరు ఇంటి నిర్మాణాలు చేపడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిని గుర్తించి గ్రామ పంచాయతీ ఆదాయం పెంచేందుకు పాటుపడాలన్నారు. కుళాయి, ఇంటి పన్ను వసూలు వంద శాతం చేసేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. పలువురు వార్డు సభ్యులు పలు కాలనీల్లో తాగునీరు, శానిటేషన్ సమస్య ఉందని, అధికారుల దృష్టికి తీసుకొచ్చినా కాలనీల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం రావడంతో కాలనీల్లో ఎక్కడా మురుగు సమస్య తలెత్తకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ గౌరవ సలహాదారురాలు ఎస్.నాగరత్నమ్మ, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆలూరు అభివృద్ధికి కృషి చేస్తా



చిప్పగిరిలో ఎమ్మెల్యే విరూపాక్షిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దేవనకొండ: తనను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ఆలూరు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బి.విరూపాక్షి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యేను మండలంలోని తెర్నెకల్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి, తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన గెలుపునకు తోడ్పాటునిస్తూ 1907 ఓట్ల మెజార్టీ తీసుకొచ్చిన తెర్నెకల్ గ్రామాన్ని, ఇందుకు కృషి చేసిన గ్రామ నాయకులు, కార్యకర్తలను జీవితంలో మర్చిపోలేనని చెప్పారు. అలాగే ఆలూరు నియోజకవర్గంలో ఉన్న ప్రతి కార్యకర్తకు ఏ ఆపద వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానని, ఆలూరును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు నామాల శ్రీనివాస్, వీరన్న, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి సంతాపం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త గజ్జహళ్లి దిబ్బయ్య (90) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను, మృతుడి కుమారుడు వెంకటేష్‌ను పరామర్శించారు. పార్టీ కోసం దిబ్బయ్య, ఆయన కుమారుడు వెంకటేష్ ఎంతో కృషి చేశారన్నారు. దిబ్బయ్య మృతి బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పచ్చారపల్లి రామిరెడ్డి, మండల కో–కన్వీనర్ మల్లికార్జున, యూత్ నాయకులు గంగాధర, నాయకులు గోపాల్, దిబ్బలింగ, బసవరాజు తదితరులు సంతాపం తెలిపారు.

అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ వెంకట్రాముడు

పత్తికొండ రూరల్ : అనుమతి లేకుండా రైతులకు విత్తనాలు అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు హెచ్చరించారు. రైతులకు రశీదు ఇవ్వకుండా విత్తన ప్యాకెట్లు అమ్ముతున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం పత్తికొండలోని లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రూ.93వేల విలువైన విత్తన అమ్మకాలు నిలిపివేసి, షోకాజ్ నోటీసు అందించారు. విత్తన లైసెన్సు రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారందరూ లైసెన్సు పొంది ఉండాలన్నారు. అలాగే అధిక ధరలకు ఎవరూ విక్రయించవద్దని సూచించారు.

రోడ్డుకు మరమ్మతులు

ఆలూరు: పట్టణంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం సమీపంలో నేషనల్ హైవే రోడ్డు–167పై పడిన గుంతలను కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు గుమ్మనూరు శ్రీనివాసులు సోమవారం జేసీబీతో పూడ్చివేయించారు. ఆ ప్రాంతంలో రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికుల కష్టాలను గుర్తించి రోడ్డును బాగు చేయించినట్లు ఆయన తెలిపారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా

మద్దికెర : ఇరిగేషన్ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవికి ఈనెల 7వ తేదీనే రాజీనామా పత్రాన్ని అధికారులకు పంపినట్లు మద్దికెరకు చెందిన రేలంపాడు వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం అందించానన్నారు. తనకు ఇరిగేషన్ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

24 వేల పాఠ్య పుస్తకాలు మంజూరు

ఆస్పరి: మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మొదటి విడతగా 24 వేల పాఠ్య పుస్తకాలు మంజూరైనట్లు ఏంఈఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం ఆస్పరిలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలానికి 70 వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా ప్రస్తుతం 24 వేలు వచ్చాయన్నారు. అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

మండల సొసైటీ చైర్మన్, సీఈఓ రాజీనామా



డీసీఓ రామాంజినేయులుకు రాజీనామా పత్రాన్ని ఇస్తున్న మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన

ఆస్పరి: ఆస్పరి మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, మండల సీఈఓగా పని చేస్తున్న ఆశోక్ తమ పదవులకు రాజీనామా చేశారు. వీరు సోమవారం కర్నూలు కేడీసీసీ కార్యాలయంలో డీసీఓ రామాంజనేయులుకు రాజీనామా పత్రాలను సమర్పించారు. ఇన్ని రోజులు తమకు సహకరించిన కేడీసీసీ ఉద్యోగులు, రైతులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

చిప్పగిరి: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఏఈ ఉలిగన్న మండలంలోని విద్యుత్ వినియోగదారులకు సూచించారు. సోమవారం మండలంలోని నంచర్ల గ్రామంలో గత మూడు నెలలుగా విద్యుత్ బల్లులు చెల్లించని మొండి బకాయిలను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్లులు సకాలంలో చెల్లిస్తే ఎటువంటి పెనాల్టీ ఉండదన్నారు. బిల్లింగ్ అయిన 15 రోజుల్లోపు ప్రతి ఒక్కరూ బిల్లులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. లైన్‌మెన్లు ప్రశాంత్, సుంకప్ప, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: సీజనల్ వ్యాధుల పట్ల క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు ప్రదీప్, వరప్రసాద్ సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వారు వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్నందున కలుషిత నీరు, అపరిశుభ్రమైన వాతావరణం వల్ల డయేరియా ప్రబలే ప్రమాదముందన్నారు. వైద్య సిబ్బంది ప్రతి రోజే ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేయాలని సూచించారు.

అండర్‌బ్రిడ్జిలో చేరిన వరద నీరు



బంటనహాలు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన వరద నీరు

చిప్పగిరి: గత వారం రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని బంటనహాలు గ్రామంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి వరద నీరు రైల్వే అండర్ బ్రిడ్జిలోకి చేరింది. రెండడుగులకు పైగా నీరు చేరడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బంటణహాలు, గుమ్మనూరు గ్రామాల ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు చర్యలు చేపట్టి అండర్‌బ్రిడ్జిలోకి నీరు చేరకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

విత్తనాలు సకాలంలో అందించాలి

హొళగుంద: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన సబ్సిడీ ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా కోరారు. ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల రైతులు సేద్యం పనులు చేపట్టారని వారికి కొరత లేకుండా విత్తనాలు అందించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఖరీఫ్‌లో పంటల సాగుకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ పనిముట్లు, పరికరాలు అందించాలని కోరారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల సాగులో రైతులు మెలకువలు పాటించేలా చూడాలని, అవసరమైన సలహాలు సూచనలు చేయాలన్నారు.

ఒకరోజు ఆలస్యంగా పాఠశాలల పునఃప్రారంభం

చిప్పగిరి: వేసవి సెలవుల అనంతరం ఈ నెల 13వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సిఉండగా ఆ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఒక రోజు ఆలస్యంగా 13వ తేదీన బడులు తెరచుకోనున్నాయి. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు పలు ఉద్యోగ సంఘాల నాయకుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఒక రోజు సెలవు పొడిగించినట్లు ఎంఈఓ బాలనాయుడు తెలిపారు. పాఠశాలల పునః ప్రారంభానికి సబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

సారా స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన ఈడిగ వెంకటేష్, వెల్దుర్తికి చెందిన దూల రామ చంద్రుడులను సోమవారం అదుపులోకి తీసుకుని 26 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. అలాగే గతంలో నాటుసారా తయారీ కేంద్రాలు నిర్వహిస్తూ పరారీలో ఉన్న వెల్దుర్తి మండలం ఎల్.బండకు చెందిన ఘమికిబాయి, బద్దీబాయి, కర్ణాటక మద్యం తరలింపు కేసులో నిందితుడిగా ఉన్న క్రిష్ణగిరి మండలం సంగాల వాసి సంధ్యాల మద్దయ్యలను అదుపులోని తీసుకుని డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో కర్నూలు స్క్వాడ్ సీఐ నరసానాయుడు, ఎస్ఐ వీరాస్వామి, కోడుమూరు సెబ్ ఎస్ఐ అలీబేగ్ పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్, సభ్యుల రాజీనామా



హొళగుంద సింగిల్ విండో చైర్మన్ పదవికి రాజీనామా చేసిన మల్లికార్జునను సన్మానిస్తున్న సెక్రటరీ తదితరులు

హొళగుంద: హొళగుంద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సింగిల్ విండో) చైర్మన్ బోయ మల్లికార్జున, సభ్యులు సహరబాను, లక్ష్మి సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. తాము అనివార్య కారణాల వల్ల సంఘం విధులకు హాజరు కాలేకపోతున్నామని తమ పదవులకు న్యాయం చేయలేకపోతున్న కారణంగా రాజీనామాలను ఆమోదించాలని ఆదోని డివిజనల్ సహకార అధికారిని కోరారు. రాజీనామా లేఖలను సంఘం సెక్రటరీ నీలకంఠస్వామికి అందజేశారు. వారిని సెక్రటరీ సన్మానించి వీడ్కోలు పలికారు.

ఆసరా సొమ్ము ఖాతాలకు జమ చేయాలి



జొన్నగిరి ఏపీజీబీ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

తుగ్గలి : ఆసరా పథకం కింద గత ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్మును వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలని కోరుతూ సోమవారం జొన్నగిరి ఏపీజీబీ ఎదుట పొదుపు మహిళలు ఆందోళన చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నాలుగు దఫాల్లో పొదుపు రుణాలు మాఫీ చేసిందన్నారు. చివరి విడత సొమ్ము పొదుపు ఖాతాలకు జమ చేసి నెలలు గడుస్తున్నా బ్యాంకు అధికారులు ఇంత వరకు పొదుపు మహిళల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయలేదన్నారు. దీంతో సంఘాల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బ్యాంకు మేనేజర్ స్పందించి వెంటనే ఆసరా సొమ్ము వ్యక్తిగత ఖాతాలకు జమచేయాలని డిమాండ్ చేశారు.

పోలీసు వలయంలో బొమ్మిరెడ్డిపల్లె



బొమ్మిరెడ్డిపల్లెలో బందోబస్తుకు వచ్చిన పోలీసులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లెలో ముందు జాగ్రత్తగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగిన ఘర్షణలో మృతి చెందిన గిరినాథ్‌చౌదరి అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. మృతదేహానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పలువురు నేతలు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తిక్కారెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీ లతామాధురి, ఆదోని, కర్నూలు దిశ, పత్తికొండ డీఎస్పీలు శివనారాయణస్వామి, బాబుప్రసాద్, శ్రీనివాసరెడ్డి, 11 మంది సీఐలు, పలువురు ఎస్ఐలు, కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. గిరినాథ్ చౌదరి హత్యకు సంబంధించి మృతుని తండ్రి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు రమేష్, రామకృష్ణతో పాటు మరో 14 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఐ, ఎస్ఐలు వీఆర్‌కు..

బొమ్మిరెడ్డిపల్లెలో జరిగిన హత్య నేపథ్యంలో సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డిని రాత్రి రాత్రే ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కర్నూలు ఫోర్త్ టౌన్‌లో ఉన్న సునీల్‌కుమార్‌ను ఎస్ఐగా, కర్నూలు సీసీఎస్‌లో ఉన్న బీవీ మధుసూదన్‌రావును సీఐ నియమించగా వీరు తెల్లవారుజామునే బాధ్యతలు స్వీకరించారు.



వరదనీటితో కళకళలాడుతున్న వేదావతి నది

ఉప్పొంగిన వేదావతి నది

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామం వద్ద వేదావతి నది వరద నీటితో ఉప్పొంగుతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎగువన అనంతపురం జిల్లా, కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నదికి భారీ స్థాయిలో వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో గూళ్యం నుంచి వేదావతి నది అవతలి వైపు ఉన్న కర్ణాటక ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. నది పక్కనే ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాస్మోపాలిటన్ క్లబ్ అభివృద్ధికి కృషి

ఆలూరు రూరల్: కాస్మోపాలిటన్ క్లబ్ అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో క్లబ్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఉన్న కమిటీని రద్దు చేసి త్రీమెన్ కమిటీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. త్రీమెన్ కమిటీ సభ్యులుగా షేక్షావలి, కె.శ్రీనివాసులు, గంగాధర్ రెడ్డిని నియమించనున్నట్లు చెప్పారు. నూతన కమిటీ ఎన్నుకునే వరకు క్లబ్ వ్యవహారాలన్ని త్రీమెన్ కమిటీ చూసుకుంటుందని తెలిపారు. క్లబ్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. సీనియర్ సిటిజన్స్ రీడింగ్ రూంను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సభ్యులు ప్రవీణ్, తిమ్మప్ప, గోవిందు, హనుమయ్య, ఎ.గోవిందు,లక్ష్మీనారాయణ ఈరన్న తదితరులు ఉన్నారు.

వర్షం.. హర్షం



హొళగుంద శివారులో వర్షం కురుస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. కొద్ది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పత్తి ఇతర పంటలు పచ్చదనం సంతరించుకుని కళకళలాడుతున్నాయి. ఆయా గ్రామాలలో చెరువులకు పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. వేదావతి (హగరి) నది కూడా వరద నీటితో కళకళలాడుతుంది. ఏదేమైనా గతేడాది వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయి ఉక్కిరిబిక్కిరి అయిన రైతులు ఈ ఏడాది రుతుపవనాల రాకతో సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టపరిహారం అందించాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

దేవనకొండ: 2018 సంవత్సరం పంట నష్టపరిహారం నిధులను తక్షణమే విడుదల చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అఖిల భారత రైతు మహాసభ సంఘం జిల్లా నాయకులు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దేవనకొండ తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 42 మండలాల్లో విపరీతమైన కరువు వచ్చిందని, కేంద్ర బృందం కరువు మండలాలను ప్రకటించిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు భూసల నాగరాజు, ఉప్పరి వీరన్న, రమేష్, వెంకటాపురం సంపత్, రాముడు, రైతులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కోతకు గురై ప్రమాదకరంగా మారిన కల్వర్టు

హాలహర్వి: మండలకేంద్రం నుంచి బాపురం, గూళ్యంకు వెళ్లే మార్గంలో వంక వద్ద కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వాహనదారులు కల్వర్టు వద్ద ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినప్పటికీ కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురికావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు కుంగిపోయింది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు వద్ద రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.